కథా నిలయం
1473
శ్రీకాకుళం

# ఉప్పు

ఊరికి దూరంగా ఓ మురికివాడ!... అక్కడ కొన్ని గుడిసెలు... దుర్గంధాన్ని వెదజల్లుతూ నిత్యమూ పారే మురికి కాలువ!

ఇది చాలదన్నట్టు... బురదలో పొర్లాడే పందులు... గాలి పీల్చినపుడల్లా నోట్లోకి పోయే దోమలు.

ఓ గుడిసె పక్కన వేపచెట్టు. ఆ చెట్టు క్రింద ఓ కుక్కి నులకమంచం. ఆ మంచంలో ఓ ముసలిప్రాణం కునుకు తీస్తోంది.

ఎండిపోయిన మొక్కలా అవుపించే దేవయ్య బ్రతుకుతెరువు చెప్పులు కుట్టడం.

చెట్టుమీద కూర్చుని కావుకావుమని అరుస్తున్న కాకి రెట్ట వేయడంతో - అదొచ్చి నులక మంచంమీద పడుకున్న దేవయ్య ముఖం మీద పడ్డది.

పడుకున్నవాడల్లా వులిక్కిపడి లేచి విసుక్కుంటూ ఆవులించి వళ్లు విరుచుకున్నాడు. గుడిసెకేసి చూశాడు. కడుపులో ఆకలి దహించి వేస్తోంది. బుర్ర గోక్కుంటూ గుడిసెలోకొచ్చి మూకుట్లో చద్దిబువ్వ పెట్టింది పెట్టినట్టే వుండడం చూచాడు. "ఈరిగాడు... ఇల్లు చేరుకోలేదన్న మాట!... ఎండలో ఎక్కడ తిరుగుతా వుండాడో..." అనేసి గొణుక్కుని కుండలో మంచినీళ్లు సత్తుగ్లాసుతో ముంచుకుని గటగటా త్రాగేసి త్రేన్చాడు. ప్రస్తుతానికి పొట్ట బరువెక్కినట్టన్పించింది.

మిగిలిపోయిన చద్ది తినాలన్పించింది. ఆకలి తీర్చుకోవాలి అనిపించింది. కానీ... అది కాస్త కొడుకు కోసం ప్రత్యేకంగా వుంచింది. తాను తినేస్తే వాడి గతేంకాను?. అందుకే మంచినీళ్లు తాగి ఆకలి తీర్చుకునేటందుకు ప్రయత్నించాడు.

గుడిసె బయటికి వచ్చి బీడీ వెలిగించి అటుఇటూ పచార్లు చేశాడు.

కుక్క గుడిసెలో కెప్పుడు దూరిందో ఏమో... మూకుట్లో అన్నం కరుడు నోట కరుచుకుపోవడం దేవయ్య కళ్లబడ్డది.

ఆ కాస్త కూడైనా కొడుక్కు దక్కాలనే ఆరటంతో 'ఛై... ఛై...'' అంటూ కుక్క వెంటపడ్డాడు.

నోట కరుచుకున్న అన్నం కరుడు జారి పడకుండా చూచుకుంటూ దేవయ్యకు చిక్కకుండా పరుగుతీసి తప్పించుకుంది కుక్క.

కరిగిపోయిన కండలకేసి... వదిలిపోయి శక్తి నశించిన శరీరంకేసి... తన అశక్తత కేసి చూచుకుని అదోలా నవ్విన దేవయ్య వెనక్కి తిరిగొచ్చి నులకమంచమ్మీద కూర్చున్నాడు.

ఈరిగాడు ఇల్లు చేరుకోగానే 'అయ్యా బువ్వేది?' అంటాడు. వాడికనేసి వుంచిన కాస్త చద్ది కుక్కెత్తుకు పోయె!... దేవయ్య మనస్సు చివుక్కుమంది.

పోనీ కొడుకొచ్చేలోగా... ఓ గిద్దెడు బియ్యం తెచ్చి వండి పడేద్దామంటే... చేతిలో వున్నది కేవలం పావలా! పావలా తీసుకు కొట్టుకెడితే ఓ గుప్పెడు నూకలైనా రావు.

దేవయ్యకి ఏంచెయ్యాలో తోచలేదు. అటు ఇటు దిక్కులు చూశాడు.

జోగయ్య తనవేపు పరుగులాంటి నడకతో రావడం గమనించాడు. అతన్ని చూడగానే దేవయ్య ప్రాణం లేచొచ్చినట్టయింది.

''నువ్వుండావో లేవో అనుకుంటూ లగెత్తుకొత్తన్నాను...'' మంచం దగ్గరగా వచ్చీరాగానే దేవయ్యని చూచి అన్నాడు జోగయ్య.

'నేనేడికి పోతాను... ఏట్టొకి!?... ఇట్టా మంచంమీద కూకుని కాస్తంత గస తీర్చుకో జోగయ్యా!...''

''మనకు మంచి బేరం తగిలింది... లెగు పోదాం...''

''ఇసయమేందో ఇవరంగా చెప్పకుండానే పోదావంటావేంది?... ఎక్కడికి? ఏంది కత?''

''గిరాకీ దొరికింది మావా!... సావు గిరాకీ!..పలక కొట్టేడానికి వప్పుకొచ్చాను... లే... పద... పోవాల...''

దేవయ్యలో వుత్సాహం తొంగిచూచింది.

''ఎంతిత్తారంట...?''

''మడిసికి పదిత్తమన్నారు. నేనింకో అయిదు ఎక్కువ అడిగినా... వొప్పేసుకుండారు. - పన్లేక పస్తులుంటుండావని నీకోసమే ఈ బేరం ఒప్పుకున్నా... అళ్లు మనకోసం ఎదురుసూత్తావుంటారు... లెగు...''

పదిహేను రూపాయలే! అమ్మో!... అంత డబ్బు చూచి ఎన్నాళ్లయిందో దేవయ్య.

''ఆళ్లెంతిచ్చినా... మన దరిద్దరం ఒకరోజుతో తీరేనా దేవయ్యా?...'' మళ్లీ జోగయ్యే అన్నాడు.

బలం పుంజుకున్న దేవయ్య శరీరం గబగబ గుడిసెలోకి నడిచింది. గుంజకు వేలాడుతున్న డప్పును చేతిలోకి అందుకున్నాడు. చూర్లోవున్న గుడ్డపేలికతో డప్పుమీద పేరుకపోయిన దుమ్ము దులిపేడు. దాన్ని అటుఇటు తిప్పిచూచి చేతితో మోగించి చూశాడు. పెదవి విరిచాడు.

''ఓసి దీనమ్మ ... బాగా దమ్మానిపోయిందే? మోత సరిగా రావడంలేదు..'' గొణుగుతూ బైటకొచ్చాడు.

''ఆడికెళ్లినాక గడ్డి మంటేసి సెగజేద్దువుగాన్లే... బయల్దేరు... సావు మేళం గదా... మనం తొరగా ఎల్లాల... అది సరే... సద్దిబువ్వేమైనా తిన్నావా?... నిన్ను సూత్తావుంటే ప్రాణం కళ్లల్లో ఉన్నట్టు అవుపిస్తా వుండాదే... పలక కొడతావా... లేకపోతే మద్దెలోనే యాలగిలబడతావా దేవయ్యా?'' మనిషికేసి తేరిపార చూస్తూ అడిగాడు జోగయ్య.

''నా సావేదో నే సత్తాలే... నడు పోదం... ఓపికవున్నా లేకపోయినా పళ్లబిగువునైనా పలక కొట్టకపోతే డబ్బెట్టా వస్తది... కూడెట్టా వుంటది...''

ఇద్దరూ నడుచుకుంటూ వెళ్లి రోడ్డెక్కారు.

తోటి పిల్లలతో గోలీలాడి... కర్రబిళ్ల ఆడి.. కాలవగట్లెంట తిరిగి చివరికి అలిసిపోయిన ఈరిగాడికి ఇల్లు గుర్తుకొచ్చింది. వచ్చీరాగానే సత్తుబొచ్చలో అన్నం వుందేమోనని ఆశగా చూశాడు. లేకపోవడంతో దాన్ని ఒక తాపు తన్నేడు. ఆకలితో నకనకలాడిపోతున్నాడేమో- ఈరిగాడిలో కోపం శృతిమించింది.

''అయ్యా... అయ్యా...'' కేకేస్తూ గుడిసెలోంచి బైటికొచ్చి చుట్టూ చూశాడు. ఎదురుగావున్న నులకమంచాన్ని ఒక తాపు తన్నేడు.

''ఏందిరా ఈరిగా... ఈరంగం వేస్తావుండావ్... మీ అయ్య సావు మేళానికి డప్పుకొట్టనీకిపోయిండు...'' పక్క గుడిసెలో వున్న ఏసోబు పెళ్లాం విషయం చెప్పింది.

''ఆకలేత్తా వుందత్తా! తింటానికుక్కాడు లేకుండా చేశాడయ్య... కళ్లు తిరుగుతా వుండాయ్...'' అంటూ కుప్పకూలిపోయాడు...

''నీ కోసం వుంచిన అన్నం కరుడు కుక్క నోట కరుచుకు పోయిందనేసి బాధపడ్డాడు నీ అయ్య... సర్లే... నీ ఆపసోపాలు చూడ్లేనుగానీ... నాకాడ గంజి నీళ్లున్నయ్... ఇటొచ్చి తాగిపో... ప్రాణం కాస్తంత కుదుటపడతది.''

ఆ మాట విన్న ఈరిగాడు గభాలున లేచి ఒక్క అంగలో పక్క గుడిసె చేరుకున్నాడు. ఆవురావురుమంటూ గంజి తాగి త్రేన్చుకుంటూ బైటికొచ్చి మంచంమీద వాలిపోయాడు.

★★ ★★ ★★

డప్పు కొట్టి కొట్టి దేవయ్య ప్రాణం కడబట్టిపోయింది. మనిషిని నీరసం పూర్తిగా ఆవహించింది. ఆకలెక్కువై కళ్లు తిరుగుతున్నాయ్.

వప్పుకున్నందుకు ఎట్లాగో డప్పుకొట్టి కూలీడబ్బు అందుకున్నాడు. మూడైదులు చేతిలో పడగానే దేవయ్యలో నవోత్సాహం తొంగిచూచింది.

పడిన శ్రమ మర్చిపోయేటందుకు సారా గొంతులో పోసుకోవాలన్పించింది. జల్సా చేసుకోవాలన్పించింది. చేపలపులుసుమీదికి మనసు మళ్లింది.

జోగయ్య, దేవయ్య ఇద్దరూ కూడబలుక్కుని సారా దుకాణం చేరారు. మొదటి గ్లాసు గొంతులో పోసుకోగానే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టన్పించింది దేవయ్యకి. మరో గ్లాసు... ఇంకో గ్లాసు.. మధ్యలో సీకులు తిన్నాడు... చేపలపులుసు జుర్రుకున్నాడు.

ఇప్పుడు దేవయ్య కళ్లకి ప్రపంచమంతా గిర్న తిరుగుతున్నట్టుంది. నోటికొచ్చినట్టల్లా వాగుతున్నాడు. మైకంలో... మత్తులో... వూగిపోతున్నాడు...

కష్టపడి సంపాదించిన డబ్బు అంగట్లో పెట్టేశాడు!

తూలుకుంటూ... నడవలేక... మధ్య మధ్య పడుతూ లేస్తూ... ఎట్లాగో గుడిసె చేరుకున్నాడు చీకట్లో.

కళ్లల్లో వత్తులేసుకుని తండ్రికోసం ఎదురుచూస్తున్నాడు ఈరిగాడు.

ఎదురెళ్లి తండ్రి భుజానవున్న డప్పు అందుకున్నాడు. గుడిసెలో గుంజకున్న మేకుకు తగిలించి వచ్చాడు...

''అయ్యా... బువ్వ తినవంటే...'' మంచంమీద పడుకున్న దేవయ్యను తట్టిలేపుతూ అడిగేడు...

'నేను సీకులు... సాపల పులుసు కడుపునిండా తిన్నాన్రా... నువ్వా తినేసి పడుకో...'' గొణిగేడు దేవయ్య.

''రెక్కలు ముక్కలు సేసుకుని సంపాదించిన డబ్బు కాస్తా తాగుడికి తగలేశావా?... కన్నబిడ్డకి కూడుందో లేదోని ఆలోసన లేదు... నువ్వు మడిసివేనంట్రా?...'' అప్పుడే అక్కడికొచ్చిన ఏసోబు దేవయ్య పరిస్థితి చూచి మండిపడ్డాడు.

ఏసోబు మాటలకి దేవయ్య మత్తు దిగిపోయినట్టయింది. పక్కగా బిక్కమొహం వేసుకు నిలబడ్డాడు ఈరిగాడు.

కొడుకు ఆకలిసంగతి... వాడికి బువ్వ లేదనే విషయం గుర్తుకు రాగానే దేవయ్య కంట్లో నీళ్లు సుళ్లు తిరిగాయి.

పక్కనేవున్న ఈరిగాడిని దగ్గరికి లాక్కుని బావురుమన్నాడు దేవయ్య.

'నేను ఎదవన్రా కొడకా!... ఎదవను !! నా కడుపు నింపుకుని... నిన్ను పస్తులుంచుతున్నాను..'' దేవయ్య గొంతు జీరపోయింది.

''సీ ఎదవ నాయాల!... చేసిన ఎదవ పనికి ఏడుత్తుండావా?... ఈ రాత్రికి కూడా కూడు లేకపోతే నీ కన్నబిడ్డ పేణం హరీ అంటది... అప్పుడు మళ్లీ డప్పు వాయిద్దువుగానీ... మళ్లీ పీకలదాకా తాగి నువ్వూ సద్దువుగానీ...'' శాపనార్థాలు పెట్టేడు ఏసోబు.

★★ ★★ ★★

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్లయిందో దేవయ్యకి తెలీదు. ఎన్నికలు ఎన్నిసార్లు జరిగాయో అంతకంటే తెలీదు. వయసొచ్చాక తానెన్నడూ ఏ పార్టీకి ఓటేసిన గుర్తులేదు.

ఎందరు మంత్రులు ఎన్నెన్ని వాగ్దానాలు చేశారో... బీదోళ్ల బ్రతుకుల్లో వెలుగు చూపిస్తామని డప్పు కొట్టుకున్నారో... ఇవన్నీ దేవయ్యకు తెలీని విషయాలు.

తనకి తెల్సిందల్లా .. ఇన్నేళ్లుగా చెప్పులుకుట్టి... అర్ధాకలితో బ్రతకడం... కటిక దరిద్రాన్ని అనుభవించడం... చేతుల్లో డబ్బున్నప్పుడు కడుపునిండా తాగడం... కుక్కి నులకమంచంలో నిద్రపోవడం!!

అక్కడ ఇక్కడ గుడిసె వేసుకుంటే డబ్బున్నోళ్లు, వేసుకున్న గుడిసెను పీకేయించి వెళ్లగొట్టారు... ఆ తర్వాత మునిసిపాలిటీవాళ్లు గుడిసెల్లోవారిని వూరికి దూరంగా తరిమేశారు.

చివరికి.. మురికివాడలో...పందులు పొర్లాడే చోట నివాసం ఏర్పరచుకున్నాడు.

ఈరిగాడికి మూడేళ్ల వయసులో ఆడి బాధ్యతంతా తనకి అప్పగించి కళ్లు మూసింది భార్య.

కొడుకుని చదివించాలని, గొప్పవాడ్ని చెయ్యాలని కలలు కన్నాడు.

తన ఆశ అందని ఎండమావిగానే మిగిలిపోయింది. గతిలేక కొడుక్కి కుల వృత్తే నేర్పాల్సి వచ్చింది!

ఈరిగాడు తెల్లబట్టలేస్కుంటే చూడాలని... వూరిమధ్యగా పెంకుటింట్లో వుంటూ వుద్యోగం ఏదేనా చేసి బ్రతికితే కళ్లారా చూడాలని తాపత్రయపడ్డాడు.

ఇవన్నీ తీరని కోరికల్లా దేవయ్యలో మిగిలిపోయినయ్.

తన్లాంటివాళ్ల బ్రతుకులు బాగుపడేదెన్నడో?... సుఖపడేదెప్పుడో?... కడుపు తాగి-వంటినిండా బట్ట కట్టగలిగేది ఏనాడో?... ఈ ప్రశ్నలకు జవాబు దొరకలేదు దేవయ్యకి.

★★ ★★ ★★

తూర్పు తెల్లవారింది.

బద్ధకంగా నిద్రలేచిన దేవయ్య ఆవులించి వళ్లు విరుచుకున్నాడు.

గుడిసెలోకెళ్లి ముంతలో నీళ్లు తెచ్చుకుని పుక్కిలించి వుమ్మేశాడు.

ఈరిగాడు అగుపించలేదు... గొంతెత్తి పిలిచాడు.. 'ఇంత పొద్దుటే... యాడికి పోయుంటాడబ్బా?' అనుకున్నాడు.

ఏసోబుని... ఏసమ్మని కొడుకు గురించి అడిగాడు.

''రేతిరి మా ఇంట్లో బువ్వ తినమని ఎంత బ్రతిమిలాడినా తిన్లేదు... యాడికి పోయిండో ఏమో తెలవదు...'' ఏసమ్మ చెప్పింది.

''అట్టనా?... ఈరిగాడు రేత్రి పస్తుండాడన్న మాట!... నీరసమొచ్చి కళ్లు తిరిగి సోలిపోయాడో ఏమో?..'' కంగారు పడ్డాడు దేవయ్య.

''నువ్వేమో నోటికొచ్చినట్టల్లా వాగావ్... ఏడ్చావ్... ఆ తర్వాత నీ దోవన నువ్వు కునుకు తీశావ్... ఆడేమో కాలే కడుపులో కాళ్లు ముడుచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ నీ మంచంకాడ పొద్దుపోయేదాకా ఉన్నాడు. నీతోపాటే వాడూ సొమ్మసిల్లి నిద్రపోయి వుంటాడనేసి అనుకున్నాం... ఇంత పొద్దున్నే ఈరిగాడు యాడికి పోయినట్టబ్బా...?'' ఏసోబు మాటలు మరింత కంగారుపెట్టాయి దేవయ్యని.

అంతలో గుడిసెల్లో జనం గుంపులు గుంపులుగా పక్కనున్న కాల్వదగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్లడం దేవయ్య చూశాడు.

ఏం జరిగిందో ఎవ్వరూ చెప్పడంలేదు. దేవయ్య కాళ్లుకూడా కాల్వగట్టుకేసి నడిచాయి.

గట్టుమీద పిల్లవాడి శవం-అది ఈరిగాడిదే!... దేవయ్య తన కళ్లను తానే నమ్మలేక పోయాడు... గొంతు పగిలేలా రోదించాడు... గుండె బాదుకున్నాడు...

''కూటికిలేక సచ్చిపోయవంట్రా కొడకా... ఒరే నాయనా... ఈరిగా... తిండి పెట్టలేక నిన్ను సవుకున్నానంట్రా కొడకా...'' శోకాలు పెడుతున్న దేవయ్యను చుట్టూ చేరినవాళ్లు ఓదార్చడానికి ప్రయత్నించారు.

''నా సావుకు నువ్వు డప్పు కొడతావనుకున్నాన్రా కొడకా... నా కళ్ల ముందే నీ సావు చూడాల్సొచ్చింది గదరా ఈరిగా. నీకు డప్పు కొట్టాలంటే నాకు చేతులెట్లా వస్తాయిరా కొడకా...'' కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు దేవయ్య.

దేవయ్య బ్రతుకు శాశ్వతంగా చీకటై పోయింది.

దేవయ్య చెవుల్లో డప్పులమోత... 'ఈరిగాడు సావలేదు.. నే డప్పు కొట్టలేను...' ఉన్మాదిలా గావుకేక పెట్టి నేలకొరిగేడు దేవయ్య.

---

★ (ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 4-2-88 సంచికలో ప్రచురితం)

# CHAITANYA
## BRAND

## MASALA POWDER

SPECIALISTS IN

PICKLE SPECIAL RED CHILLI POWDER

MANUFACTURERS: Phone : 4065893

**CHAINTANYA MASALA STORES**

**9-11, Opp. Konark Theatre,**

**Dilsukhnagar, Hyderabad-500660**

# SRI GANESH HOME PRODUCTS

MANUFACTURERS OF VARIETIES OF

## "CHIKKIS"

**(MADE FROM GROUNDNUT, TILL, MURMURA, KAJU, BADAM)**

CONTACT: Phone: 4065893

**SRI PARESH. M. KARANI**

**9-11, Opp. Konark Theatre,**

**Dilsukhnagar, Hyderabad-500660**